క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన ఎల్‌బీనగర్ నేతలు



మన్సూరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కత్తుల రాంబాబు, నాగోలు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవిలతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు శనివారం మంత్రిని కలిసి పూలమొక్కను బహూకరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: ఉచిత వైద్యశిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఎల్‌సీహెచ్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'సర్వేంద్రియాణం నయనం ప్రధానం' అని అందరూ.. కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో శ్రీ నేత్రాలయ హాస్పిటల్‌కు చెందిన కంటి వైద్య నిపుణులు, సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంవీ బ్రహ్మం, ప్రధాన కార్యదర్శి సూర్యం, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, సలహాదారుడు వెంకటేశం, వైద్య సిబ్బంది ఆకాంక్ష, మార్కెటింగ్ మేనేజర్ రాము పాల్గొన్నారు.

పక్షవాతంపై అవగాహన

మన్సూరాబాద్: ప్రపంచ పక్షవాతం దినోత్సవం సందర్భంగా ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో చిత్రలేఅవుట్‌కాలనీలో పక్షవాతంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కామినేని హాస్పిటల్స్ న్యూరాలజిస్ట్ డాక్టర్ నవీన్‌కుమార్ హాజరై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పక్షవాతం సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై విపులంగా వివరించారు. వైకల్యం, మరణాలకు పక్షవాతం ప్రధాన కారణంగా ఉందని, వయస్సు పెరిగే కొద్ది పక్షవాతం వచ్చే అవకాలున్నాయన్నారు. ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లో అత్యాధునిక పద్ధతుల్లో పక్షవాతానికి చికిత్స అందిస్తున్నామన్నారు.

యువతి అదృశ్యం



అయేషా ఫాతీమా (ఫైల్)

చంచల్‌గూడ: స్నేహితురాలిని కలిసేందుకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన ఆదివారం మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చావణీ డివిజన్ బాగే జారాలో నివసించే అయేషా ఫాతీమా (20) వృత్తిరీత్యా బ్యూటీషియన్. ఆమె గత గురువారం స్నేహితురాలిని కలిసేందుకు పురాణీ హవేలీ వెళ్తున్నట్లు కుటుంబసభ్యులకు తెలిపింది. కాగా రాత్రి దాటినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అన్నిచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో యువతి కుటుంబసభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వాహన తనిఖీల్లో రూ. 5 లక్షలు స్వాధీనం

నాగోలు: ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తున్న వ్యక్తి వద్ద నుంచి రూ.5 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం చింతలకుంట చౌరస్తాలో ఎల్‌బీనగర్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. కొండకింది భాస్కర్ అనే వ్యక్తి కారులో నగదు రూ. 5 లక్షలు తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులు అతడి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని ఎల్‌బీనగర్ అసెంబ్లీ ఎన్నికల అధికారి ఎదుట హాజరు పరిచారు.

నేడు కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో..) టమోటా రూ.21, వంకాయ రూ.23, బెండకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 16, క్యారెట్ 37, దొండకాయ 18, ఆలుగడ్డ 22, ఉల్లిగడ్డ రూ.55, గోకరకాయ రూ.28, దోసకాయ 13, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.13, అరటి 09, చిక్కుడు 55, అర్వి 38, మునగ 85, చిలగడదుంప 45, బీట్‌రూట్ 25, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 75, కాప్సికమ్ రూ. 45గా ఉన్నాయి. ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేతల్లో కొరవడిన సేవాగుణం

- రాజకీయం వ్యాపారంగా మారింది
- విద్య, వైద్యం ఉచితంగా అందించే వారినే ఎన్నుకుంటాం
- సాక్షి ప్రజా ఎజెండా చర్చా గోష్టిలో ఆటో డ్రైవర్ల స్పష్టీకరణ



మన్సూరాబాద్ కామినేని చౌరస్తా వద్ద ఆటోడ్రైవర్లతో చర్చా గోష్టి

మన్సూరాబాద్: నాటితరం రాజకీయ నేతలు సేవాగుణంతో ప్రజలకు సేవా చేసేవారు. నేటి రాజకీయ నేతలు రాజకీయాలను వ్యాపారంగా మార్చి ఓటును నోటుతో కొనుగోలు చేస్తున్నారు. ఉచితంగా విద్య, వైద్యం అందించే వారినే ఎన్నుకుంటామని మన్సూరాబాద్ ఆటో డ్రైవర్లు స్పష్టం చేశారు.

◆ మన్సూరాబాద్ కామినేని చౌరస్తాలోని ఆక్సిజన్ పార్కు, ఆటోస్టాండ్ వద్ద సాక్షి ఆధ్వర్యంలో 'ప్రజా ఎజెండా' పేరుతో ఆటో డ్రైవర్లతో చర్చా గోష్టి ఆసక్తికరంగా సాగింది.

◆ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే సత్తాతో పాటు ప్రజలకు సేవా చేయాలనే ఆసక్తి ఉన్న నాయకులను ఎన్నుకుంటామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక ఉపాధి అవకాశాలు సరిగ్గా లేక యువత ఆటోడ్రైవర్లుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నాయకులు జాప్యం చేస్తున్నారన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు రాజకీయ నేతలు ప్రాధాన్యమిస్తూ.. ఆటోడ్రైవర్లను చిన్నచూపు చూస్తున్నారని, ఆటోడ్రైవర్లు రాజకీయ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా విద్య, వైద్యం అందించేవారినే ఎన్నుకుంటాం



ఉచితంగా విద్య, వైద్యం అందించే రాజకీయ పార్టీ, నేతలనే ఎన్నుకోవాలనే నిర్ణయానికి వచ్చాం. ఎన్నికల సమయంలో హామీలిచ్చి ఓట్లు దండుకుని ఎన్నికల అనంతరం ప్రజా సమస్యలను పట్టించుకోని నేతల పట్ల అప్రమత్తంగా ఉంటాం. స్థానిక సమస్యలపై అవగాహన ఉండి పరిష్కరించే సత్తా ఉన్న నేతను ఎన్నుకుంటాం.

– నక్క మున్నా, ఆటోడ్రైవర్, బాలాజీనగర్

సంక్షేమానికి పాటుపడే నాయకుడికే పట్టం కడతాం..



ఆటోడ్రైవర్ల సంక్షేమానికి పాటుపడే నాయకుడికే పట్టం కడుతాం. డీజిల్, పెట్రోల్ రేట్లు విపరీతంగా పెరిగిన గత 8 ఏళ్లగా ఆటో మీటర్ రీడింగ్ కనీస చార్జీలను పెంచలేదు. మూడు నెలలకు రూ.130 ఉన్న టాక్స్‌ని ప్రభుత్వం రద్దు చేసింది. వాహనం ఇన్సూరెన్స్ రేట్లను మూడింతలకు పెంచారు.

– కదారి సిద్దులు, ఆటోడ్రైవర్, మన్సూరాబాద్ ఓల్డ్ విలేజ్

ప్రజలకు సేవ చేయాలనే తపన నాయకుల్లో లేదు



ప్రజలకు సేవ చేయాలనే తపన నేటితరం నేతల్లో లేదు. రాజకీయాలను వ్యాపారంగా మార్చి నోటుతో ఓటును కొనుగోలు చేయాలని నేతలు ఎన్నికల్లో ముందుకు వస్తున్నారు. ఇలాంటి నేతల పట్ల అప్రమత్తంగా ఉండి సరైన తీర్పును ఇస్తాం. ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎవరి కారణంగా అభివృద్ధి చెందుతుందో గుర్తించి వారికి ఓటును వేస్తాం.

– మోహనకృష్ణ, ఆటోడ్రైవర్, బాలిరెడ్డినగర్‌కాలనీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ నిస్వార్థంగా అందించే అభ్యర్థిని ఎన్నుకుంటాం. ఆటోడ్రైవర్లకు సమాజంలో సముచిత స్థానం కల్పించి, ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యమిచ్చే అభ్యర్థులకు ఓటు వేయాలనే నిర్ణయానికి వచ్చాం.

– సాయి, ఆటోడ్రైవర్, ఎరుకల నాంచారమ్మ బస్తీ

ధర్మాన్ని పరిరక్షించడం మన బాధ్యత



అయ్యప్ప స్వాములను అభినందిస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: సనాతన ధర్మాన్ని పరిరక్షించడం మన అందరి బాధ్యతగా గుర్తించాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సైదాబాద్‌కు చెందిన పవన్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాల ధరించి శబరిమలకు పాదయాత్రగా వెళ్తున్న స్వాములను కలిసి ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 154 మంది అయ్యప్పస్వాములు హైదరాబాద్ నుంచి శబరిమలలోని స్వామి సన్నిదానం వరకు 38 రోజుల పాటు 1148 కిలోమీటర్లు పాదయాత్రగా వెళ్లడం వారి ఆధ్యాత్మిక సేవను తెలియజేస్తుందన్నారు. శబరిమల పాదయాత్ర రూపకర్త దివంగత వేణుగోపాల్ గురుస్వామి సూచించిన మార్గంలో ప్రతి ఏటా స్వాములు పాదయాత్రగా వెళ్తున్నారన్నారు. అయ్యప్ప స్వాముల పాదయాత్ర క్షేమంగా సాగిన వారు స్వామివారి దర్శనాన్ని కన్నులార చేసుకుని తిరిగి నగరానికి క్షేమంగా చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

చిన్నారులకు అరుదైన చికిత్స

చైతన్యపురి: పుట్టుకతో చెవిటి, మూగ చిన్నారులు నలుగురికి దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలోని మాగ్నస్‌వి ఈఅండ్‌టీ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్ చేశారు. మహబూబ్‌నగర్‌కు చెందిన సిద్దార్థ్ నాయక్ (5), నల్గొండకు చెందిన అభిరాంనంద్ (5), నంద్యాలకు చెందిన గౌశియా (4), ఈస్ట్ గోదావరికి చెందిన కార్తికేయ (7)లకు ఆసుపత్రి వైద్యులు సత్యకిరణ్, రవికుమార్, అనస్తీషియా నిపుణుడు జె.రవికుమార్, ఆడియాలజిస్ట్ నాగకిరణ్‌లు వీరికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీని పూర్తి చేశారు. రూ. 10 లక్షల ఖర్చు అయ్యే అరుదైన ఆపరేషన్‌ను ఉచితం అందించామన్నారు. మూడేళ్ల పాటు వారికి స్పీచ్ థెరఫీ అందించనున్నట్లు వైద్యులు తెలిపారు. పుట్టుకతో మూగ, చెవిటి పిల్లలకు, మధ్యలో వినికిడి లోపం వచ్చిన వారికి ఈ ఆపరేషన్ వల్ల వారి జీవితంలో వెలుగు నింపవచ్చన్నారు. చెవిటి, మూగ పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఏమాత్రం దిగులు చెందకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఆపరేషన్ చేయించుకున్న చిన్నారులతో మాగ్నస్ వి ఆసుపత్రి వైద్య బృందం

కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం



టెలిఫోన్ కాలనీ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: నియోజకవర్గంలో ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు ఉందని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, షాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెంటూరి రవీంద్రరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సబితాఇంద్రారెడ్డికి మద్దతుగా ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్య ఉంటూ.. ఆపద వస్తే ఆదుకునే సబితా ఇంద్రారెడ్డిని గెలిపించుకుంటే ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీల కట్టు కథలు నమ్మొద్దని, పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేసే బీఆర్ఎస్ ప్రభుత్వానికే తిరిగి పట్టం కట్టాలని కోరారు. సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ ప్రజల జీవితాల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. సీఎం కేసీఆర్ అడగకముందే వరాలిచ్చే ప్రజలను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నారని, అలాంటి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకుంటే ప్రజల జీవితాలు మరింత బాగుపడుతాయన్నారు.

మహేశ్వరం అభ్యర్థిత్వంపై పునరాలోచన చేయాలి

- కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని కాపాడుకున్నాం
- సీనియర్ నాయకుడు దేపా భాస్కర్‌రెడ్డి



కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మహేశ్వరం అసెంబ్లీ అభ్యర్థిత్వంపై పునరాలోచన చేయాలని సీనియర్ నాయకులు దేపా భాస్కర్ రెడ్డి కోరారు. ఆర్‌కేపురం డివిజన్ స్వాగత్ గ్రాండ్ కన్వెన్షన్‌హాల్‌లో మహేశ్వరం ఆదివారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. గత 10 ఏళ్ల నుంచి నియోజకవర్గంలో పార్టీని భుజాలపై మోస్తున్న తన లాంటి వారిని కాకుండా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు అనే నెపంతో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి టికెట్ ఇవ్వడం ఏంటని అధిష్టానాన్ని ప్రశ్నించారు. నియోజకవర్గంలో పార్టీ కోసం నిరంతరం పని చేస్తుంటే గత ఎన్నికల్లో సబితా ఇంద్రారెడ్డికి అధిష్టానం టికెట్ కేటాయించిందని, అప్పుడు ఆమె గెలుపును తమ భుజస్కంధాలపై వేసుకొని గెలిపిస్తే అధికార పార్టీలో చేరారన్నారు. అయినా నిరాశ చెందకుండా పార్టీ కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తూ.. నియోజకవర్గ పరిధిలో జరిగిన సర్పంచి, ఎంపీటీసీ, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకున్నామన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో తనతో పాటు టికెట్ ఆశించిన నేతల్లో ఎవరికి కేటాయించినా పార్టీని గెలిపించుకునే వారిమని, నియోజకవర్గంలో 90% కార్యకర్తలు తనకే టిక్కెట్ కేటాయించాలని కోరుతున్నారన్నారని తెలిపారు. సమయం మించిపోలేదని కాంగ్రెస్ అధిష్టానం మరోసారి పునరాలోచించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో పార్టీ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, రామకృష్ణపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామిడి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లెంకి ధనరాజ్‌గౌడ్, హైటెక్ రాము, బొక్క భూపాల్‌రెడ్డి, తలాటి రమేష్‌నేత, రవినాయక్, పెద్దవూర సైదులు, రాఘవేందర్, బొడ్డుపల్లి తిలక్, నగేష్ తదితరులున్నారు.

అనాధ విద్యార్థికి ఆర్థికసాయం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్రా లేఅవుట్‌లోని అనాధ విద్యార్థి గృహ విద్యార్థి దాసరి మహంకాళి ఎంబీబీఎస్ కోర్సు చదువుకునేందుకు రుషిత తొడుపునూరి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సతీష్ ఆర్థికసాయం చేసేందుకు ముందుకొచ్చారు. గతంలో వచ్చి వార్తా కథనానికి స్పందించిన ఆయన ఆదివారం గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ సమక్షంలో దాసరి మహంకాళి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదివేందుకు రుషిత చారిటబుల్ ట్రస్టు తరపున రూ.25 వేల డబ్బును అందజేశారు. గత నెలలో మొదటి విడతగా రూ.50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనాధ విద్యార్థి గృహం ఒక అమ్మలా అనాధ, నిరుపేద విద్యార్థులకు ఆశ్రయమిచ్చి, అన్ని సౌకర్యాలూ కల్పించి, వారి భవిష్యత్తుకు అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. సహకరించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, గృహ సతీష్ అధ్యక్షులు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

అధిష్ఠానం పునరాలోచించాలి



మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ టికెట్ విషయంలో పార్టీ అధిష్ఠానం పునరాలోచించాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఆదివారం యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డిలలో ఎవరికో ఒకరికి సీటు కేటాయించాలని పలువురు యువ నాయకులు కోరారు. స్థానిక నాయకులను కాదని నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తికి టికెట్ కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని ప్రజలు, నాయకులకు అండగా ఉంటానన్నారు. తాను పార్టీ పిలుపు మేరకు అనేక కార్యక్రమాలు చేపట్టానని అదిష్టానం టికెట్ కేటాయింపులో పునరాలోచన చేయాలన్నారు.



మధుయాష్కీతో దేరింగుల కృష్ణ



మధుయాష్కీగౌడ్‌తో శైలజారెడ్డి

కాంగ్రెస్‌లోకి చేరిక

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేరింగుల కృష్ణ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెండి శశిధర్‌రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ.. తాను ఎల్‌బీనగర్ నియోజకర్గంలోని హయత్‌నగర్ ప్రాంతానికి చెందిన వాడినని కొంత మంది కావాలని తనను స్థానికేతరుడిగా ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం గురించి పూర్తి అవగాహన ఉందని, తాను కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తే ఓడిపోతానన్న భయంతోనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వ్యక్తులకు ప్రజలు భవిష్యత్తులో సాధారణ ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెప్పి తీరుతారన్నారు.

కాంగ్రెస్‌లోకి శైలజారెడ్డి..

నాగోలు: బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు, నాగోలు డివిజన్ మమతానగర్ ఎన్‌ఆర్ టవర్స్‌లో నివాసం ఉండే కె. శైలజారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి ఆదివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2014లో ప్రజలకు న్యాయం జరుగుతుందని (అప్పటి టీఆర్ఎస్ పార్టీ) బీఆర్ఎస్‌లో చేరినట్లు వివరించారు. కొంతమంది నాయకుల స్వార్థం కోసం పార్టీ పనిచేస్తుందని ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సభ్యులు, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

ఆరు గ్యారంటీ పథకాలతో అధికారంలోకి వస్తాం !



మలక్‌పేట అభ్యర్థి అక్బర్‌ను అభినందించిన కాంగ్రెస్ నేతలు

చాదర్‌ఘాట్ : ఆరు గ్యారంటీ పథకాలతో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని మలక్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి అక్బర్ ధీమా వ్యక్తం చేశారు. మలక్‌పేట కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'అవినీతి, బంధు ప్రీతి, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు'. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు పెద్దఎత్తున ఆదరిస్తున్నారన్నారు. ఈసారి మలక్‌పేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనను అభినందించారు. కాంగ్రెస్ నాయకులు బొల్లు కిషన్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, మదన్‌బాబు, బాబు శ్రీనివాస్, జాఫర్, ఇక్బాల్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు పట్టం కట్టాలి



మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలని, అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ ప్రభుత్వ నియంత పాలనకు చరమగీతం పాడాలని ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఆదివారం వనస్థలిపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆదివారం హస్తినాపురంలో బూత్ వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో మంత్రి కేటీఆర్ తన స్థానికత గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇక్కడే పుట్టిన బిడ్డగా నాకెంత హక్కు ఉందో ఇక్కడకు వచ్చి నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ అంతే హక్కు ఉందన్నారు. మెదక్‌లో పుట్టి గజ్వేల్, కామారెడ్డి, సిరిసిల్లకు వెళ్లిన పారాషూట్లు కల్వకుంట్ల కుటుంబమన్నారు. ఉద్యమ సమయంలో సోదర తెలుగు ప్రజలను కేసీఆర్ బండ బూతులు తిట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. సోనియాగాంధీ ఆదేశాల ప్రకారం పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ చేయించింది తామేనన్నారు. జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు వజీర్ ప్రకాష్‌గౌడ్, యోగేశ్వర్‌రెడ్డి, సుజాతరెడ్డి, సదాశివుడు, లింగాల కిశోర్, సామ మహేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

మలక్‌పేట్‌లో రాజకీయ గందరగోళం

- నాలుగు పార్టీలది నాలుగు రకాల దారి
- ప్రచారం చేసుకోలేక బీఆర్ఎస్, కాంగ్రెస్
- టికెట్ ఖరారు జాప్యంలో బీజేపీ, మజ్లిస్


సైదాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మలక్‌పేట నియోజకవర్గంలో రాజకీయ నాయకుల పరిస్థితి గందరగోళంగా మారుతోంది. నియోజకవర్గ ఎన్నికల బరిలో నాలుగు ప్రధాన పార్టీలు బరిలో దిగుతుండగా.. ఒక్కో పార్టీ పరిస్థితి ఒక్కో రకంగా సాగుతోంది. చతుర్ముఖ పోటీలో ఎవరికి వారు తాము ఎన్నికల బరిలో దిగి గెలుపుతో బయటపడతామని భావిస్తున్నా.. ఆయా పార్టీల అగ్రనాయకత్వం తీరుతో ఎప్పుడు టికెట్ తమ చేయి జారిపోతుందో అని నాయకులు బెంబేలెత్తి పోతున్నారు.

◆ ప్రధాన పార్టీల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమ అభ్యర్థులను ప్రకటించగా.. సిట్టింగ్ స్థానమైన మజ్లిస్, బీజేపీలు ఇంకా టికెట్లు కేటాయించలేదు. ఆయా పార్టీల నుంచి టికెట్లు దక్కినవారు, ఇంకా టికెట్లు దక్కనివారు కూడా అయోమయంగానే ఉండటం గమనార్హం. టికెట్ వచ్చినవారు, ఆశిస్తున్నవారు ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులు ఇలా ఉన్నాయి.

వచ్చిన టికెట్ ఉంటుందా...

◆ బీఆర్ఎస్ అభ్యర్థి అయోమయం

అధికార బీఆర్ఎస్ ప్రకటించిన మొదటి జాబితాలోనే మలక్‌పేట అభ్యర్థిని కూడా ప్రకటించారు. టికెట్ దక్కిందని సంతోషించే లోపే ఇంకా ఆయనకు ఇప్పటివరకు పార్టీ నుంచి బీ- ఫారమ్ మాత్రం దక్కలేదు. తన అభ్యర్థిత్వం మారుతుందేమోననే అయోమయంలో ఆయన ఉన్నారు. కాంగ్రెస్ జాబితాలో ఇక్కడి నుంచి మైనారిటీ యువ నాయకుడికి టికెట్ కేటాయించడంతో, మజ్లిస్‌తో ఉన్న స్నేహం కారణంగా మరో నాయకుడికి టికెట్ కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. దీంతో పేరుకే జాబితాలో తన పేరు ప్రకటించి టికెట్ వేరే వారికి ఇస్తారనే గుబులు అభ్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.



మలక్‌పేట నియోజకవర్గం

స్థానికేతరుడికి నాయకులు సహకరిస్తారా...

◆ బుజ్జగింపులతో కాలం గడుపుతున్న కాంగ్రెస్ అభ్యర్థి

మలక్‌పేట నియోజకవర్గంలో పార్టీ టికెట్ ఆశిస్తూ.. పలువురు కాంగ్రెస్ నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. ఇద్దరు, ముగ్గురు నాయకులు చివరి వరకు తమలో ఎవరికో ఒకరికి టికెట్ వస్తుందని ఆశించారు. పార్టీ అధిష్టానం అనూహ్యంగా కొత్త వ్యక్తికి టికెట్ కేటాయించింది. రాజకీయ అనుభవం లేని అతడికి టికెట్ ఇవ్వడంతో అది ఆశించిన నాయకులు బిత్తరపోయారు. పార్టీ టికెట్ పొందిన అభ్యర్థి 10 రోజులుగా నియోజకవర్గంలోని పార్టీ సీనియర్ నాయకులను బుజ్జగించడమే పనిగా పెట్టుకుని తిరుగుతున్నారు. నియోజకవర్గంలోని 6 డివిజన్‌లలో డివిజన్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలను దారికి తెచ్చుకోవడమే పనిగా పెట్టుకుని అసలు ఎన్నికల ప్రచారాన్ని మాత్రం ఇంత వరకు మొదలు పెట్టలేకపోతున్నారు.

బీజేపీ నుంచి స్థానికేతరులకేనని ప్రచారం..

◆ నరాలు తెగే ఉత్కంఠలో నాయకులు

మలక్‌పేట నుంచి బీజేపీ తరపున అసెంబ్లీకి పోటీ చేయడమే లక్ష్యంగా రెండు, మూడేళ్లుగా తెర వెనుక ప్రయత్నాలతో పలువురు నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇక్కడి నుంచి ఎన్నికల బరిలో దిగటానికి అరడజనుకు పైగా నాయకులు తమ గాడ్‌ఫాదర్ నాయకుల అండతో వారిపై నమ్మకంతో తమకే టికెట్ ఖాయమని పైకి చెబుతున్నా.. అభ్యర్థిత్వంపై నరాలు తెగే ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

స్థానికేతరులకు అవకాశం..

మలక్‌పేట బరిలో గత రెండుసార్లు పార్టీ స్థానికేతరులకు అవకాశం కల్పించింది. ఈసారి అదే సంప్రదాయాన్ని పాటిస్తుందని తెలుస్తోంది. ఇప్పటికే స్థానికేతరుడైన గత ఎన్నికల అభ్యర్థినే పార్టీ ఎంచుకుందని ప్రచారం జరుగుతుంది. నాయకులు తమ ఆశలు వదులుకోలేక పార్టీ ప్రకటించే జాబితా కోసం పడిగాపులు పడుతున్నారు.

ఎప్పుడు ప్రకటించినా అభ్యర్థి ఆయనే...

◆ ఒక దఫా ప్రచారం కూడా పూర్తి చేసిన మజ్లిస్

పునర్విభజన అనంతరం ఉన్న మలక్‌పేట నియోజకవర్గానికి ఇప్పటి వరకు నిర్వహించిన మూడు సార్లు ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థి ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యేనే అభ్యర్థి. ఇప్పటి వరకు మజ్లిస్ కూడా తమ ఎన్నికల అభ్యర్థుల జాబితాను ప్రకటించలేదు. పాతబస్తీలో కొన్ని స్థానాల్లో అభ్యర్థుల మార్పును పార్టీ పరిశీలిస్తుంది. ఈ జాబితాలో మలక్‌పేట ఉందా.. లేదా.. అనేది పార్టీ అధిష్టానంపై ఉంది. మజ్లిస్ ఎప్పుడు జాబితా ప్రకటించినా అభ్యర్థి ప్రస్తుత ఎమ్మెల్యే అని నాయకులు అంటున్నారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గం మొత్తం ఒకసారి అంతర్గత ప్రచారాన్ని కూడా పూర్తి చేశారని సమాచారం. ఇతర పార్టీల కంటే మజ్లిస్ అభ్యర్థినే తనకు టికెట్ కేటాయింపుపై ఎన్నికల్లో గెలుపుపై పూర్తి ధీమాతో ఉన్నారు.